
# ఓ జీవితం
## కథ

లక్ష్మి భారతి రెడ్డి



ఊహ తెలీకముందు అమ్మ, తెలిశాక నాన్న కాలధర్మం చేయడంతో దాదాపుగా నా జీవితం రోడ్డెక్కింది.

ఉన్న పెంకుటిల్లు ఎప్పుడో నాన్న చేసిన అప్పులకు చెల్లు చీటీ అయింది. వెనకా ముందు ఎవరూ లేరని అనను. బంధువులున్నారు కానీ వాళ్ళ స్థాయికి నేను సరిపోను. అందుకే పలకరింపే కరవైంది.

బతికేందుకే అవకాశమూ లేదు. పరులైనా ఎన్నాళ్ళని పెడతారు తిండి. ఏదో ఒక రోజు నా దారి నేను చూసుకోవాల్సిందేగా?

ఈ నేపథ్యంలో జీవితం రైల్లో జీవనం కోసం ప్రయాణమయ్యాను తిరుపతికి. ఊరు విడిచివెళ్తున్నందుకు అంతా బాధపడ్డారు ఒక్క బంధువులు తప్ప ! పీడవిరగడైంది లేకుంటే మాపై పడి ఛస్తే ఎన్నాళ్ళని సాకం ?' అనుకున్నారేమో ? రోజంతా టౌన్లో కలియ తిరిగాను. ప్రతి షాపులోనూ పని అడిగాను. అబ్బే ! లాభం లేకపోయింది.

చివరిగా కాస్త సేదతీరడం కోసం మున్సిపల్ పార్కుకెళ్ళాను,

అక్కడున్న జనం నాకు లేని ఆనందాన్ని ఆనందంగా అనుభవిస్తున్నారు.

ఆకలేస్తోంది. కడుపులో పేగులు మేఘాల్లా గర్జిస్తున్నాయి.

జేబులో చిల్లర చూసుకున్నాను. యాభై రూపాయలున్నాయి. ఏదో ఒక పని దొరికే వరకు దాన్నిలాగే కాపాడుకోకపోతే ఆపై పరిస్థితి? అందుకే వాడదలచుకోలేదు.

పార్కు కుళాయి దగ్గరకెళ్ళి త్రిప్పాను. ఏడుకొండల వాడికి ఎంతాదాయం ఉన్నా పార్కులో నీళ్ళు అంతంత మాత్రమే.

కడుపునిండా నీళ్ళు తాగి పార్కు నుండి బైట పడ్తున్నంతలో 'హలో – నిన్నే.....' అన్న పిలుపు విని ఆగి తల త్రిప్పి చూసాను. ఈ మహా 'జనారణ్యం'లో నన్నెవరు పలకరిస్తున్నారు అనుకుని.

ఓ నడి వయస్కుడు నన్ను సమీపించి 'నువ్వు రాజుగారి అబ్బాయివి కదూ?' అని ప్రశ్నించాడు.

"అవునండి"

'మీనాన్న నాకు బాగా తెలుసయ్యా !'

నేనేం అనలేదు. అతను చెప్పేది వినాలని.

ఒకప్పట్లో మీ నాన్న నాకు బాగా సాయం చేశారయ్యా. పాపం ఆ దిక్కుమాలిన ట్రక్కు గుద్ది అతన్నెగరేసుకుపోయింది. అవునూ నువ్వేమిటి ఇలా.... ఇక్కడ ? జరిగింది చెప్పాను క్లుప్తంగా

'అయ్యో అలాగా ! మరేం పర్వాలేదు. కొర్లగుంట సెంటర్లో నాకో కాకా హోటల్ ఉంది. అందులో పనిచేద్దువు గాని రా.'

అతని ఆహ్వానం నాలో కొత్త ఆశలు మొలకెత్తించాయి.

★ ★ ★ ★

నా కుడివైపు శరీరంలో తగలని గాయాలంటూ లేవు. కారణం నాకు కుడి కన్ను లేకపోవడమే. చిన్నప్పుడు కర్రా బిళ్ళ ఆడుతుంటే ప్రమాదవశాత్తు కుడికన్నుకి దెబ్బ తగలటంతో ఆ కన్నును తొలగించి గాజుకన్ను వేశారు డాక్టర్లు.

కాకా హోటల్లో నా బాధలు మరీ ఎక్కువై పోయాయి. ఎందరో కస్టమర్లను ఢీ కొట్టడం చివాట్లు తినడం అలవాటైపోయింది.

గాజుపాత్రలు, గ్లాసులు కడిగేటప్పుడు అవి పగల కొట్టడం పరిపాటయిపోయింది. అది నా తప్పు కాకపోయినా తప్పడం లేదు.

'చూడు రామచంద్రా! మీనాన్న మీదున్న గౌరవం కొద్దీ, నీ పరిస్థితుల దృష్ట్యా నిన్ను పనిలో పెట్టుకున్నాను. నాది కాకా హోటల్, పెట్టుబడి అంతంతమాత్రమే. ఇలా రోజుకు నాలుగైదు గ్లాసులు, ఒకటో

రెండు పాత్రలు పగులకొడితే నేనేం కావాలి? ఓ టీ గ్లాసు ఖరీదు అయిదు రూపాయలు. నీ జీతం ఆరొందలు. ఇహ లాభం లేదయ్యా, నువ్వెన్ని గ్లాసులు పగులకొడితే వాటి ధర నీ జీతంలో మినహాయించుకుంటాను. లేకపోతే నేను దివాలా తీయాల్సొస్తుంది.

అతని మాటలకు గుండె గోతిలో పడ్డట్టయ్యింది.

అది కాదన్నా మీతో చెప్పని విషయం మరోటుంది అని ఆగాను సంకోచంగానే.

'.....................'

నాకు కుడి కన్ను లేదు. ఉన్న ఎడమకన్ను చూపూ అంతంత మాత్రమే.

నేను కావాలని చేసిందంటూ ఏమీ లేదు. అంతా నా ఖర్మ!

అతనేం అనలేదు కానీ అతని మొఖంలో కాస్త జాలి జాడలు కన్పించాయి.

నెల గండంలా గడిచింది.

ఒకటో తారీఖు !

ఇదిగో నయ్యా నీ జీతం ఆరొందలు. నువ్వు పగలకొట్టిన సామాన్ల ఖరీదు నాలుగొందలు. ఇక నీకు రావాల్సింది రెండొందలే. అయినా నేనేం మినహాయించుకోవడం లేదు. పూర్తిగా ఇస్తున్నాను. మరోమాట ఇకపై నువ్విక్కడ పనిచేయాల్సిన అవసరం లేదు. దురదృష్టం వల్ల నీకేదైనా జరిగితే ఆ పాపం నాకొద్దు. చేసేదేమీ లేక ఏం చెయ్యాలో తెలీక, చాత కాక నిన్ను పంపించటం తప్పటం లేదు. రాజు తలచుకుంటే దెబ్బలకూ, డబ్బులకూ కొదవలేదు, యజమానీ అంతే అనుకుని నమస్కరించి వెనుతిరుగుతుంటే.

'ఆ ఒక్క నిముషం. వెళ్తూ వెళ్తూ ఈ ఉత్తరం పోస్ట్ చెయ్యి. స్టాంపులు అతికించే ఉన్నాయి. డబ్బాలో వెయ్యి చాలు' అన్నాడు ఓ ఉత్తరం నాకు అందిస్తూ.

★ ★ ★ ★

పోస్ట్‌బాక్స్‌లో లెటర్ వేసి వెనక్కు తిరగడం, ఎవరో అమ్మాయిని గుద్దటం, ఆమె నా చెంప 'ఛెళ్'మనిపించటం క్షణాల్లో జరిగిపోయాయి.

' ఏరా కళ్ళు దొబ్బాయా? కాస్త చూసుకుని వెనక్కు తిరగొచ్చుగా? కొవ్వెక్కి నట్లుంది దించుతా భడవా! ' ఓ ఇరవై ఏళ్ళమ్మాయి నాపై గయ్యిమంది 'సారీనండి చూసుకోలేదు' చెంపను చేతితో రుద్దుకుంటూ అన్నాను.

'ఎలా కనిపిస్తాయి రా రాస్కెల్ !'

'అది కాదండి'

'ఏది కాదురా పనికిమాలినోడా! చేసింది తప్పు ఆపై దాన్ని కప్పిపుచ్చుకునేందుకు ప్రయత్నాలు. ఏదీ ఇలాగే మీ అమ్మ రొమ్ములను గుద్దరాదూ?!'

'క్షమించండి, కాస్త శాంతించండి. నాకు కుడి కన్నులేదు.' అన్నాను కళ్ళద్దాలు తీసి ఆమెకు చూపిస్తూ.

'అబద్ధం! రెండు కళ్ళూ నిక్షేపంగానే ఉన్నాయే ఏం ఏం తగిలిందట తెగులు?'

'నా చిన్నతనంలోనే ప్రమాదవశాత్తు కుడి కన్ను పోయింది. రెండు కళ్ళూ మీకు కనిపిస్తున్నా, కుడి వైపుది గాజుకన్ను'

'నేను నమ్మను! తప్పించుకునేందుకు ఇదో బుకాయింపు'

'సరే తీసి చూపించమంటారా?'

'అబ్బే వొద్దొద్దు అంటాననుకున్నావా? ఏది తీసి చూపించు!'

'భయపడరుగా?'

" ఏం నువ్వు డ్రాకులానా? లేక కింగ్‌కాంగ్‌వా భయపడ్డానికి. నకరాలు ఆపి తీసి చూపించు. అది నిజం కాదో చెప్పు తెగేలా కొడ్తాను.'

మా సంభాషణ పెరగడంతో జనం గుమిగూడారు.

ఆమె అలా అనడంలో వెనుతిరిగి కుడి కన్ను తీసి అరచేతిలో ఉంచుకుని ముందుకు తిరిగాను. ఓ చేతిలో గాజుకన్ను, ఓ చేతిలో కళ్ళద్దాలు, కందిన మొహం.

ఓ కన్ను లేకపోతే ఏం కన్నీళ్ళకు కొదవ లేదు. కుడి కంట్లో నిండిన చిన్న పాత్రలో నుంచి కారే అదనపు నీరులా కన్నీరు.

ఆ క్షణంలో నేను అనుభవించిన బాధ రాసేందుకు అక్షరాలు సరిపోవు, అనుభవిస్తేనే తెలుస్తుంది అంటే అబద్ధం కాదు.

ఆమె 'కెవ్'మని అరిచి పారిపోయింది.

గుమికూడిన జనం కదిలారు.

కానీ ఎవరిలోనూ కాస్తంటే కాస్త జాలి కలగలేదు.

ఈ కలికాలంలో కాలంతో పాటు కాలగర్భ ఊబిలో నెమ్మదిగా నిదానంగా కూరుకుపోతున్నదే జాలి.

★ ★ ★ ★

నవ్వుతూ వెక్కిరిస్తూ.... వేధిస్తూ ఏడ్పిస్తూ వీలైతే ఓదారుస్తూ.... ఆశల ఆసరా ఇస్తూ ఎగతాళి చేస్తూ.... బతకమంటూ.....ఎందుకంటూ నిలువునా నిలదీస్తూ.... జాలిపడ్తూ పరువు తీస్తూ..... చూస్తూ.... ప్రశ్నిస్తూ..... క్షణమొక యుగంగా మారుస్తూ......!

ఇన్నిరకాలుగా వేధించే జీవితం అనవసరమనుకున్నాను.

జేబులో ఆరొందలు సరిచూసుకున్నాను. మంచి హోటల్ కెళ్ళాను. బిర్యానీ, రైతా స్వీటు, ఐస్‌క్రీమూ తిన్నాను. పాన్ వేసుకున్నాను. అలవాటు లేకపోయినా సిగరెట్ కాల్చాను.

రోడ్డమ్మట వెళ్తుంటే పురుగుల మందులు అమ్మే షాపు కనిపించి లోనికెళ్ళాను. ఎండ్రిన్ కొన్నాను.

షాపతనికి డబ్బిస్తుంటే కౌంటర్ పక్కనే ఉన్న ఓ చిన్న డబ్బా కనిపించింది. 'ఇదేమిటి?' అతన్ని అడిగాను.

'ఇది రెడ్ క్రాస్ వారు ఏర్పాటు చేసిన డొనేషన్ డబ్బా. మీకు బుద్ధి పుట్టినంత డబ్బు ఇందులో వెయ్యచ్చు. ఈ మొత్తాన్ని వారు అనాథలు, వికలాంగులకి, ప్రకృతి వైపరీత్యాల వల్ల సమస్తం కోల్పోయిన వారికి ఇలా సామాజిక కార్యక్రమాలకు ఉపయోగిస్తారు' చెప్పాడతను.

జేబులో మిగిలి ఉన్న మొత్తాన్ని తీసి అందులో వేశాను.

ఎవరూ లేని నిర్జన ప్రదేశానికి చేరుకుని ఎండ్రిన్ మూత తెరిచి ముందుంచుకున్నాను. ఒక్క నిముషం ఇష్టదైవాన్ని తలుచుకుని ఎండ్రిన్ అందుకోబోతున్నంతలో ఎక్కడి నుంచో గాలికి ఎగురుకుంటూ వచ్చిన

ఓ కాయితం నా చేతికి అడ్డు పడింది. ఏమిటా అని చూశాను. అందులో ఇలా రాసుంది ప్రింటింగ్ మేటర్.

'ప్రతి సమస్యకూ పరిష్కారముంటుంది. కాకపోతే మనం దాన్ని వెతుక్కోవాలి, సమస్యను తరిమి తరిమి పారదోలాలి. అంతేకాని దానికి భయపడి జీవతం వదిలి పారిపోవటం అవివేకం, తొందరపాటుతనం.

సమస్యలు లేనివారంటూ ఈ భూగోళంలో ఎవరూ లేరు. అందరూ అలా సమస్యలకు భీతిల్లి చనిపోవాలనుకుంటే, ఈ ప్రపంచంలో మనిషంటూ ఎవరూ మిగలరు. సమాధులు తప్ప.

జీవితాన్ని సవాలుగా తీసుకుని ఎదురొడ్డి పోరాడి గెలవాలే గాని జీవితమే ఓ సమస్యగా భావించరాదు.

నేను ఆలోచించడం ఆరంభించాను.

## వాళ్ళంతే.... మనమంతే...

వాళ్ళ ఆదర్శాలు వింటూంటే...
పట్టపగలు వీధి దీపాలు వెలుగుతున్నంత
వెగటుగా వుంటుంది !
వాళ్ళ ఆప్యాయతలు చూస్తుంటే.....
పబ్లిక్ నీళ్ళ కుళాయిలను అవసరం లేకుండా
తిప్పివదిలేసినంత బాధగా వుంటుంది !
వాళ్ళ అనురాగం ఆలకిస్తుంటే.......
జనసమర్ధన గల సిమెంటు నడిరోడ్డులో
అరటి తొక్కలు విసరినంత అసహ్యంగా వుంటుంది
వాళ్ళ దేశ సేవను గూర్చి వింటుంటే....
ప్రపంచ బ్యాంకులో అప్పుకోసం
దేశాన్ని తాకట్టు బెట్టినంత కష్టంగా వుంటుంది
వాళ్ళ ఆర్భాటాల హామీలు చూస్తుంటే
అరచేతిలో స్వర్గాన్ని వెతుక్కున్నంత
అమాయకంగా వుంటుంది
వాళ్ళ శాంతి ప్రవచనాలు వింటుంటే....
నగ్జల్స్ తిరుగాడే కల్లోలిత ప్రాంతాల్లో
గిరిజనులపై ఖాకీల వేధింపుల్లా వుంటుంది
వాళ్ళ 'జన్మభూమి' 'ప్రజాపథం' నమ్ముకొంటే......
నేతి బీరకాయల్లో నెయ్యి వెతికినట్టుంటుంది
వాళ్ళ ఎన్నికల అడావుడి చూస్తుంటే........
పొరుగుదేశంతో యుద్ధానికి
సన్నద్ధమైనట్లుంటుంది !
వాళ్ళ పాలనా కాలాన్ని గమనిస్తుంటే
ఎప్పటికీ పరిణామం చెందని వాళ్ళంతే
మనమింతేలాగుంటుంది !

- కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడి

## సమన్వయించుకుంటే

### డా॥ సి. నారాయణరెడ్డి



ఇంటి పక్కన భవన నిర్మాణం జరుగుతుంటే
ఉద్భవించే దుర్భవించే దుర్భర ధ్వనుల దాడిని
ఇక్కడున్న చెవులు తట్టుకోక తప్పదు.
అస్తమానం మనం వినాలనుకునేది
సుశ్రావ్యశ్రుతులేనా.
శ్రుతి వున్నప్పుడు అపశ్రుతీ వుండక తప్పదు.
ప్రతి జీవితం అనుభవించేది
పరస్పర విరుద్ధ ఫలితాల సంపుటినే.
ప్రపంచమంటే
పడుకోగానే నిద్రను కళ్లకంటించే ఏ.సి.గదికాదు.
వీధికెక్కితే వెంటాడుతుంటాయి.
అనూహ్యంగా రగులుకునే పగల్లాంటి సెగలు.
కొన్నిటిని కబళించాలి
కొన్నిటికి అతీతంగా జీవించాలి.
ఉలితన తలను నిర్దాక్షిణ్యంగా చెక్కుతున్నప్పుడు
ఎలా భరిస్తుందో శిల.
ఈ ప్రశ్నకు సమాధానం చెప్పేదెవరు?
నేను చెబుతావిను అంటూ
తూర్పు దిక్కు పలికింది
తాను ప్రసవవేదన సహించేది
సూర్యోదయం కోసమని.
శిల గర్భక్షభ భరించేది
శిల్పోదయం కోమని.
ఇలా సమన్వయ సూత్రాన్ని సంధించి చూస్తే
ఈ రెండు తార్కాణాలు
మానవ జీవ బింబంలోని ఉభయ పార్శ్వాలకు
కొలమానాలు.